# గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
# ప్రమోషన్లు, నియామకాలు జరిపించాలి
# అప్రెంటిస్ సర్వీస్‌కి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

## జనవరి 6న రాష్ట్ర ధర్నా - యుటియఫ్

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాకపోవటం వలన చాలా నష్టం జరుగుతున్నది. ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయులతో పోల్చుకుంటే తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. ఈ సమస్యల పరిష్కారం కోసం **ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్)** నిరంతరం ప్రాతినిధ్యాలు చేస్తున్నది. పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన పద్ధతులు గురించి పదేపదే చెబుతున్నాము. అయినా గిరిజన సంక్షేమ శాఖ అధికారుల అలసత్వం వలన అసాధారణ జాప్యం జరుగుతున్నది.

సక్సెస్ స్కీమ్ ద్వారా రావాల్సిన హెడ్మాష్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఆశ్రమ స్కూళ్లకు రావటమే చాలా ఆలశ్యంగా వచ్చాయి. వచ్చినా ఫలితం దక్కటం లేదు. జి.ఓ. 276 ద్వారా 2010 ఆగస్టులో 2151 పోస్టులు మంజూరయి 16 నెలలు గడుస్తున్నా ప్రమోషన్లు యివ్వటం లేదు. ప్రమోషన్ల సమస్యపైన కోర్టు తీర్పు వచ్చిన తర్వాత కూడ ప్రమోషన్ల షెడ్యూల్ ప్రకటించటం లేదు. 190 మందికి గెజిటెడ్ హెడ్మాష్టర్ ప్రమోషన్‌లు, 1200 మందికి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు వచ్చే అవకాశం వుంది. ఈ ప్రమోషన్లు యిస్తే 1400 మంది గిరిజన నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించే అవకాశం వుంది. ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయ్యే పోస్టులను కూడా స్పెషల్ డిఎస్‌సిలో కలపాలని యుటియఫ్ డిమాండ్ చేసింది. అయినా గిరిజన సంక్షేమశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించి 750 పోస్టులకే స్పెషల్ డిఎస్‌సిని పరిమితం చేసింది.

ప్రభుత్వ, పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల అప్రెంటిస్ సర్వీస్‌కి నోషనల్ ఇంక్రిమెంట్లు వచ్చి 3 సంవత్సరాలు గడుస్తున్నది. ఎస్‌సి, ఎస్‌టి, బీసీ ఉపాధ్యాయుల అన్‌ట్రైన్డ్ సర్వీస్‌కి, స్పెషల్ విద్యావాలంటీర్ సర్వీస్‌కి కూడా నోషనల్ ఇంక్రిమెంట్లు వచ్చాయి. కానీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల అప్రెంటిస్ సర్వీస్‌కి మాత్రం నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వటం లేదు. గిరిజన సంక్షేమ అధికారులు బాధ్యతారహితంగా ఆర్థిక శాఖ అనుమతి లేకుండా ఇచ్చిన ఉత్తర్వుల వలన మరింత కాలయాపన జరిగింది. ఇప్పటికైనా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవటానికి అధికారులు చొరవ తీసుకోవటం లేదు.

ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్లతోపాటు ఇతర ముఖ్యమైన సమస్యల పరిష్కారానికై యుటియఫ్ చేపట్టిన పోరాటానికి దిగివచ్చిన గిరిజన సంక్షేమ అధికారులు అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని వ్రాతపూర్వక సమాధానాలు ఇచ్చారు. వాటిలో సర్వీస్ రూల్స్, సక్సెస్ పథకంలో పోస్టుల మంజూరు ఉత్తర్వులు వచ్చాయి తప్ప మిగిలిన సమస్యలు అలాగే వున్నాయి. అందువలన మరో పోరాటానికి పూనుకోవాల్సి వచ్చిందని తెలియజేస్తున్నాము. కనుక **ది. 06.01.2012 శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం వద్ద రాష్ట్ర ధర్నా జరుగుతుంది.** ఈ పోరాటంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**ముఖ్యమైన డిమాండ్లు :**

1. గిరిజన సంక్షేమ పాఠశాలలకు జి.ఓ. 276 ద్వారా ఏడాది క్రితమే మంజూరై ఖాళీగా ఉన్న హెడ్మాష్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కేడర్ సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు యివ్వాలి.
2. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఖాళీగా వున్న అన్ని పోస్టులను మరియు ప్రమోషన్లు యివ్వటం ద్వారా వచ్చే ఖాళీలను కూడా కలిపి మొత్తం పోస్టులకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలి.
3. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (సిఆర్‌టి)లలో అర్హతలుగల వారికి స్పెషల్ డిఎస్‌సిలో ప్రాధాన్యత యివ్వాలి.
4. సిఆర్‌టీల జీతాలు జి.ఓ.3 ప్రకారం టైమ్ స్కేల్‌లోని ప్రారంభ వేతనంతో పాటు అలవెన్స్‌లు కలిపి చెల్లించాలి.
5. ప్రభుత్వ, పంచాయితీరాజ్ టీచర్లతో సమానంగా అప్రెంటిస్ సర్వీస్ చేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
6. ఎంఇఓ, డిప్యూటీ డిఇఓ, డైట్ లెక్చరర్, జెఎల్ తదితర గెజిటెడ్ పోస్టులలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ప్రమోషన్ అవకాశం కల్పించాలి.
7. ఉన్నత చదువులు చదివే గిరిజన ఉపాధ్యాయులకు రెండోసారి కూడా ఆన్‌డ్యూటీ సదుపాయం కల్పించాలి.
8. ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏ తదితర పథకాలన్నీ గిరిజన పాఠశాలలకు వర్తింప చేసి మౌలిక వసతి సౌకర్యాలను అభివృద్ధి చేయాలి.
9. వివిధ ఐటిడిఏల పరిధిలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి.
10. రాష్ట్ర మరియు జిల్లా స్థాయిల్లో డిపార్ట్‌మెంటల్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను తరచుగా నిర్వహించాలి.

**హైదరాబాద్**

**ది.27.12.2011**

**ఉద్యమాభివందనాలతో....**

**ఆం.ప్ర. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్**

**రాష్ట్ర కమిటీ**